క్లుప్తంగా

పోస్టులు పెంచాలి

సూర్యాపేటటౌన్ : డీఎస్సీ నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అధిక మొత్తంలో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులే ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేవలం 2629 ఉండటం చాలా బాధకరమన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెంచి మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోలోజు మహేష్, రాజేష్, మధుసూదన్, వంశీ, అంజి, వీరబోయిన మహేష్, నరేష్, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఆర్

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చీమ వెంకన్న భార్య చీమ ధనమ్మ (35) గత రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబాన్ని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, చింతమళ్ల రమేష్, యల్కపల్లి వెంకన్న, వెన్న మధూకర్‌రెడ్డి, గోగుల ఈదయ్య, గోగుల శ్రీనివాస్, మట్టపల్లి సైదులు, వీరబోయిన మహేష్ తదితరుల పాల్గొన్నారు.

చెరువు నీటిని తీసిన వ్యక్తులపై చర్యలు తప్పవు

మద్దిరాల : చెరువులలో నీటిని తూముల ద్వారా తీసినట్లయితే చర్యలు తప్పవని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. చందుపట్లలోని చెరువు నీటిని గుర్తు తెలియని వ్యక్తులు తూముల ద్వారా తీసినట్లు అందిన సమాచారం మేరకు సోమవారం తూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వహీద్, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, వంగూరి రమేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సురాంభ

మద్దిరాల: జి.కొత్తపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన సీసీరోడ్డు పనులను సోమవారం జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్న గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొబ్బిలి నర్స మ్మ, మాజీ ఎంపీటీసీ బొబ్బిలి వెంకన్న, పులిగిల్ల వెంకన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో విహార యాత్ర

నూతనకల్ : అల్లునూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులను దాత కాస నరేందర్ సహకారంతో విహార యాత్రకు తీసుకెళ్లారు. పాఠశాలకు చెందిన 45మంది విద్యార్థులను రామోజీ ఫిల్మ్‌సిటీకి తీసుకెళ్లి వారికి కావాల్సిన అన్ని వసతులను సమకూర్చారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో పలు ప్రదేశాలను చూపించారు. విహార యాత్రకు సహకరించిన దాతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్య, ఉపాధ్యాయులు రుద్రం మహేందర్, పల్లా సుదర్శన్‌రెడ్డి, బంటు యాదగిరి, వెంకటరత్నం పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



బహుమతి పొందిన సూర్యాపేట జట్టు

నాగార్జునసాగర్ : క్రీడలతో ఆరోగ్యంతో పాటు క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పేర్కొన్నారు. నందికొండ హిల్ కాలనీలో మూడు రోజులుగా జరుతున్న రాష్ట్ర సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతిని నల్లగొండ జిల్లా సాధించగా, ద్వితీయ బహుమతిని సూర్యాటపేట జిల్లా సాధించాయి. రెండు బహుమతులు ఉమ్మడి నల్లగొండ జిల్లాకే దక్కడంతో క్రీడాకారులు, నాయకులు, నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగదీశ్‌యాదవ్, కర్తయ్య, భూలోకరావు, కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, రాజా ప్రసాద్, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, నాగరాజు, ఉంగరాల శ్రీను పాల్గొన్నారు.

స్థలం ఇచ్చారు.. భవనం మరిచారు

- జాజిరెడ్డిగూడేనికి చెందిన గురుకుల పాఠశాలకు సొంత భవనం కరువు
- కాసర్లపహాడ్‌లో ప్రభుత్వ స్థలం కేటాయించినా ప్రారంభం కాని పనులు
- నిర్మాణంలో జాప్యం కారణంగా వెనక్కి మళ్లిన రూ.35కోట్ల నిధులు



కాసర్లపహాడ్‌లో గురుకుల పాఠశాల, కళాశాల కోసం కేటాయించిన స్థలం



గురుకుల పాఠశాల స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలానికి మంజూరైన సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలకు సొంభవనాలు లేకపోవడంతో కొంత కాలంగా వాటిని సూర్యాపేట మండలం బాలెంలలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో తాత్కాలికంగా నడిపిస్తున్నారు.

గదులు చాలదంలేదనే కారణంతో..

2016లో జాజిరెడ్డిగూడెం మండలానికి అప్పటి ప్రభుత్వం ఎస్సీ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఆ పాఠశాలను కొద్ది రోజులు ఇక్కడ తాత్కాలికంగా నడిపించారు. కానీ ఆ తర్వాత గదులు చాలడం లేదనే కారణంతో సూర్యాపేటలోని ఓ అద్దె భవనానికి తరలించారు. అప్పటినుంచి జాజిరెడ్డిగూడెం మండలానికి మంజూరైన పాఠశాలను సూర్యాపేట మండలంలోనే నిర్వహిస్తున్నారు.

7 ఎకరాల స్థలం కేటాయించినా..

జాజిరెడ్డిగూడెం మండలానికి మంజూరైన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల ఏర్పాటుకై మండల పరిధిలోని కాసర్లపహాడ్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అంతేకాకుండా ఈ స్థలంలో సొంతభవనం నిర్మాణం కోసం సుమారు రూ.35 కోట్లు కూడా గతంలో మంజూరయ్యాయి. అయితే వివిధ కారణాలతో టెండర్ ప్రక్రియ కాలేదు. చివరికి వచ్చిన నిధులు వెనక్కిపోయాయి. మళ్లీ అప్పటినుంచి ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు.

పాఠశాల, కళాశాలల్లో 640 మంది విద్యార్థినులు..

ప్రస్తుతం సూర్యాపేట మండలం బాలెంలలో నడుస్తున్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో 640 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా జాజిరెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన బాలికలే. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ విద్యాలయాలు లేకపోవడంతో స్థానిక విద్యార్థినులు సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలోని సూర్యాపేటకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు. అంత దూరం వెళ్తూ ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలని, కాసర్లపహాడ్‌లోని ప్రభుత్వ స్థలంలో గురుకుల పాఠశాల, కళాశాలల భవన నిర్మాణం చేపట్టాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు

వెంటనే సొంత భవనం నిర్మించాలి



జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో సొంత భవనం లేదనే కారణంతో ఇక్కడి పాఠశాలను సూర్యాపేట మండలం బాలెంలలో నడిపిస్తున్నారు. దీంతో అంతదూరం వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని గ్రామంలో సొంత భవనం నిర్మించి ఇక్కడే పాఠశాల, కళాశాలలను నడిపించాలి.

– బందెల ఇందు, విద్యార్థిని

ఉన్నతాధికారులకు విన్నవించాం



గురుకుల విద్యాలయాలు, కళాశాలలకు సొంతభవనాలు నిర్మించాలని ఇప్పటికే అనేకసార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశాం. ఎస్సీ గురుకుల, కళాశాల భవనాల నిర్మాణం కోసం కాసర్లపహాడ్‌లో 7 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించారు. వెంటనే నిధులు మంజూరు చేసి భవనం నిర్మించాలి.

– మచ్చ నర్సయ్య, పీపీఎల్ వ్యవస్థాపకుడు

రైతు సంఘం సభ్యత్వాల నమోదు



వెంపటిలో రైతు సంఘం సభ్యత్వ నమోదులో పాల్గొన్న సీపీఎం నాయకులు

తుంగతుర్తి : రైతులకు వారబందీ పద్ధతిలో కాకుండా 15 రోజుల వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా వచ్చే నీటిని వారానికి ఒకసారి విడుదల చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందడంలేదని తెలిపారు. పంట పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని 15 రోజుల వరకు నీటి విడుదలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, పల్లా సుదర్శన్, ఉప్పలయ్య, విష్ణుమూర్తి, ముత్తయ్య, నాగయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలకు నగదు బదిలీ చేయాలి

- జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య



మాట్లాడుతున్న కడెం లింగయ్య

నాగారం : రెండో విడత గొర్రెల పథకం కోసం డీడీలు కట్టిన గొల్ల కురుమలందరికీ వెంటనే నగదు బదిలీ చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య అన్నారు. సోమవారం నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో జీఎంపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గొల్ల కురుమలు డీడీలు తీసి ఏడాది గడుస్తున్నా నేటికీ రెండో విడత గొర్రెల పంపిణీ చేయకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వం గొల్ల కురుమలందరికీ గొర్రెలు పంపిణీ చేస్తామని మోస పూరిత వాగ్దానాలతో మోసం చేసిందన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల కురుమల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. డీడీలు చెల్లించిన యాదవులకు వెంటనే వారి అకౌంట్లలో రూ.5 లక్షలు జమచేయాలని కోరారు. యాదవులకు విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలని, 50 ఏళ్లు నిండిన యాదవులకు నెలకు రూ.5000 పింఛన్ ఇవ్వాలన్నారు. బీమా సౌకర్యం, మెడికల్ ఇన్సూరెన్స్, ప్రమాదంలో చనిపోయిన యాదవులకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ నాయకులు కన్నెబోయిన కిష్టయ్య, జోగం వెంకన్న, కొడారి లింగయ్య, కొడాలి గట్టయ్య, కన్నెబోయిన అవిలయ్య, రాజాలు, ఐలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ కోసం సంతకాల సేకరణ



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న వీరపాపయ్య, నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలో ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుతూ ఎంసీపీఐయూ తుంగతుర్తి డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య ఆధ్వర్యంలో సోమవారం అర్వపల్లిలో సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఆధార్ అప్‌డేట్ అవసరం కావడంతో మండల ప్రజలు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యాపేటకు వెళ్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని అర్వపల్లిలోని ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బందెల ఆంజనేయులు, ఎర్ర రాజశేఖర్, పుప్పాల నర్సింహ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జెండర్ కమిటీలను ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

ఆత్మకూరు (ఎస్) : గ్రామ పంచాయతీల వారీగా అన్ని శాఖలతో జెండర్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ వినోద్ కుమార్, ఎంపీడీఓ హసన్ అలీకి బాల పరిరక్షణ సమితి, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు సోమవారం వినతిపత్రం అందించి మాట్లాడారు. 20 సంవత్సరాలుగా పిల్లల హక్కుల కోసం ఎంవీ ఫౌండేషన్, బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తోందన్నారు. కిశోర బాలికలకు అంగన్వాడీల పరిధిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి ఆదివారం సమావేశాలు నిర్వహించి.. బాల్యవివాహాలు, లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమకు మద్దతుగా నిలిచేందుకు అన్ని శాఖల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.వెంకటయ్య, లలిత, సైదులు, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



అన్నారం గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



సంగెం-అన్నారం మధ్య ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

- అన్నారం – సంగెం రహదారిలో సుమారుగా 30 మూలమలుపులు
- రోడ్డుకు ఇరువైపులా కమ్ముకుంటున్న కంపచెట్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండలం అన్నారం నుంచి సంగెం గ్రామానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి మూల మలుపులతో ప్రమాదకరంగా మారింది. అన్నారం ఎక్స్‌రోడ్డు నుంచి సంగెం గ్రామానికి మధ్య ఉన్న 7 కిలో మీటర్ల దూరంలో సుమారు 30 మూల మలుపులు ఉన్నాయి. ఈ మూలమలుపులు చూస్తే పాము మెలికలను, ఎల్, సీ, జెడ్, ఎస్ ఆకారాలను తలపిస్తున్నాయి. ఈ మూల మలుపులు దగ్గర దగ్గరగా ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనబడక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మూల మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. అంతేకాకుండా రహదారి వెంట కంపచెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రహదారిపై ఆటోలు, బైక్‌లు బోల్తాపడి పలువురు గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలని, మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మూల మలుపుల వద్ద ప్రమాదాలను నివారించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. మూలమలుపులు అధికంగా ఉండటంతో రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడంలేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలి.

– శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న తహసీల్దార్

మద్దిరాల : చిన్ననెమిల ప్రభుత్వ పాఠశాలలో తహసీల్దార్ అమీన్‌సింగ్ సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

అర్వపల్లి : అర్వపల్లిలో శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ నెల 2న ఈ క్రీడలు మొదలయ్యాయి. వివిధ జిల్లాల నుంచి 30 కబడ్డీ టీంలు తమ పేర్లను నమోదు చేసుకోగా ఇప్పటి వరకు సూర్యాపేట, వరంగల్, జనగామ, మహబూబాబాద్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాలకు చెందిన 15కు పైగానే టీంలు కబడ్డీ ఆడాయి. బుధవారంతో ఈ క్రీడలు ముగియనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కబడ్డీ క్రీడలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

అంచెలంచెలుగా పథకాలు అమలు



అర్వపల్లి : వినియోగదారులకు జీరో బిల్లులు అందజేస్తున్న నాయకులు



చివ్వెంల : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ సంతోష్ కుమార్

అర్వపల్లి : ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అంచెలంచెలుగా అమలు చేస్తుందని తిమ్మాపురం మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్, అర్వపల్లి దేవస్థానం ధర్మకర్త రత్నం లక్ష్మాజీ అన్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా సోమవారం తిమ్మాపురంలో లబ్దిదారులకు జీరో బిల్లులను అందజేసి మాట్లాడారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ డి.పూర్ణయ్య, బొల్లం బాలరాజు, కొణతం కరుణాకర్‌రెడ్డి, ఇందుర్తి శేఖర్‌రెడ్డి, జీడి సైదులు, కర్కాని జానయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకానికి దరఖాస్తుల వెల్లువ

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని 200 యూనిట్లలోపు జీరో బిల్లులకు అర్హులు కాని వినియోగదారులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సేవా కేంద్రంలో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. సేవా కేంద్రానికి కేటాయించిన కంప్యూటర్ ఆపరేటర్లు దరఖాస్తులను స్వీకరించారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో వినియోగదారులకు సోమవారం విద్యుత్‌శాఖ సిబ్బంది జీరో బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. వినియోగదారులు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌తో మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ చేసుకొని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎల్ఎం దిగోజు విజయ్‌కుమార్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్.సైదులు, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్.వలి, సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ అధ్యక్షుడు అక్బర్ పాషా, జాన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్న వినియోగదారులు



నాగారం : శాంతినగర్‌లో వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది

సేవా కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ

చివ్వెంల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం కార్యాలయంలోని సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలకు అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ నాయుడు, జూనియర్ అసిస్టెంట్ దిలీప్, టైపిస్ట్ మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన పల్స్ పోలియో



పోలియో చుక్కలు వేస్తున్న సీహెచ్ఓ చరణ్

అర్వపల్లి : ఐదేళ్ల లోపు పిల్లలకు చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం సోమవారం జాజిరెడ్డిగూడెం మండలంలో రెండో రోజూ కొనసాగింది. తొలిరోజు 1965 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయగా రెండో రోజు 91 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్, సీహెచ్ఓ చరణ్ తెలిపారు. మంగళవారం కూడా ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో సీతారామచంద్రస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించనున్న కల్యాణోత్సవానికి ఆలయాన్ని గ్రామస్తులు ముస్తాబు చేస్తున్నారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా అన్నెం చినవెంకట్‌రెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అర్వపల్లిలో వైభవంగా శేషవాహన సేవ



శేషవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి శేషవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాముపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలు కొలువుదీరారు. శేషవాహన సేవ ఉత్సవం సందర్భంగా తొలుత ఆలయంలో పూజలు జరిపి మాడ వీధులలో ప్రదక్షిణలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పాముపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటికీ హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, కనుకు రేణుక, లక్ష్మాజీ, ఈఓ వై.శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాసరెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, స్వామి సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి ఆలయంలో పూజలు

అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని సోమవారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తహసీల్దార్‌ను దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొరపిడత అవిలయ్య, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలంధర్‌రావు, గిర్ధావర్ నవీన్, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, ధర్మకర్త జేరుపోతుల సోమయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ వెంకట్‌రెడ్డికి సన్మానం



నాగారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

నాగారం : నాగారం మండల నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డిని నాగారంబంగ్లా గ్రామస్తులు సోమవారం శాలువాలతో సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐను సన్మానించిన వారిలో కన్నెబోయిన అవిలయ్య, కన్నెబోయిన హరీష్, శ్రీకాంత్, శంకర్, రవి, పూర్ణాచారి, లింగస్వామి, అనిల్, కారుణాచారి తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హసీం

ఆత్మకూరు(ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ మహమ్మద్ హసీం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీఓ ఈశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజమ్మ తదితరులు ఉన్నారు.

బీసీ కులాల నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉపేందర్



తిరుమలగిరి : బీసీ కులాల సమితి తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా కొత్తపల్లి ఉపేందర్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి పసుపులేటి కరుణాకర్ తెలిపారు. ఉపేందర్ మాట్లాడుతూ బీసీ కులాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు.